# కస్తూరీ తిలకం

కె. వీణారెడ్డి

"కస్తూరీ !"

ఆ పిలుపులోని అంతరార్థం అర్థమైంది గనుక ఉలిక్కిపడింది పది రోజుల క్రితం నాటిలాగే మళ్ళీ కస్తూరి.

పొద్దుటి నుంచీ ఇంటెడు చాకిరీతో సతమతమైనా చెమరించని మేను ఆ పిలుపుతో తడిసి ముద్దైపోయింది. ఒంట్లో సన్నగా వణుకు ప్రారంభమైంది.

ఎకైక ఆడపడుచు కళ్యాణి దుస్తులు బీరువాలో సర్ది పెట్టి తడబడుతూనే అత్తగారి ముందు హాజరైంది.

"మీ అన్న రాలేదు. డబ్బు పంపలేదు. ఏమిటింత ఆలస్యం? కనీసం జవాబు జాబైనా రాయలేదేం మీ అన్నయ్య?"

మాట్లాడలేదు కళ్యాణి.

"ముంగిలా ఏమి టా భంగిమ? మాట్లాడవేం?" కళ్ళెగరేస్తూ అంటున్న ఆడపడుచు కళ్యాణివేపు దీనంగా చూసింది కస్తూరి.

"జాలి చూపుల్తో జోల పాడుదా మనుకుంటున్నావేమో? అవన్నీ సాగవు మా ముందు ! మిగిలిన కట్నం బాపతు ఆ అయిదు వేలూ పంపమంటే కొంపలంటుకున్నట్టు గాభరా పడతా రేం? దానమా? ధర్మమా? అంత గతిలేని వాళ్ళెందుకొప్పుకోవాలి ముప్పై వేలకి? మా వల్ల కాదని తప్పుకుంటే లక్షణంగా ఏభై పైచిలుకు సంబంధాన్ని ఖాయం చేసుకునే వాళ్ళం. కర్మ కర్మ దరిద్రగొట్టు సంబంధం !"

పెళ్ళి చరిత్ర తిరగేసింది పార్వతమ్మ.

"పలక వేమిటే మొద్దూ? ఇదీ సంగతని ఉత్తరానికి జవాబైనా రాయొచ్చుగా మీ అన్నయ్య? ఏమి టీ నిర్లక్ష్యం? ఇచ్చుకున్నది ఆడపిల్లనా, ఆవకాయ జాడీనా?" జాడించేసింది మళ్ళీ.

"అమ్మ అంతలా అడుగుతుంటే ఊరికే ఉండటంలో నీ ఉద్దేశం?" నిలదీసింది కళ్యాణి.

"అన్నయ్య కసలు ఉత్తరమే రాయలే దత్తయ్యా !" తలొంచుకునే చిన్నగా అంది కస్తూరి.


"ఆఁ?" కళ్ళు వెళ్ళబెట్టింది కళ్యాణి.

"ఏమిటీ?" దీర్ఘం తీసింది పార్వతమ్మ.

"అంతగా చెప్పినా ఎందుకు రాయలేదు? మా మాటంటే నీ కింత అలుసా?"

"అదికాదు కళ్యాణీ..."

"ఏదికాదే? కళ్ళు నెత్తి కెక్కాయా? ఉత్తరం



CHANDRA

రాయమంటే ఎందుకు రాయలేదు?''

"అత్తయ్యా !'' కస్తూరి కంఠం వణికింది.

"అన్నయ్య చాలా ఇబ్బందుల్లో ఉన్నాడు ! కష్టంమీద సమకూర్చిన కట్నం బాపతు ఆ డబ్బు, అనుకోకుండా అన్నయ్యకు జరిగిన యాక్సిడెంట్లో విరిగిన కాలు ఆపరేషనుకూ, హాస్పిటల్ ఖర్చులకూ సరిపోయిం దత్తయ్యా ! పరిస్థితి తారుమారై చిక్కుల్లో ఉన్న అన్నయ్యకు ఉత్తరం రాసి వాడి బాధను మరింత పెంచటం ఇష్టం లేకపోయింది !''

"ఓ యబ్బో ఎంతోటి సోదరప్రేమ ! అవన్నీ మా కనవసరం. మా క్కావాల్సింది మిగిలిన ఆ అయిదు వేలు ! అంతే !''

"అత్తయ్యా ! కేవలం అయిదు వేలే అనుకుంటే ఎప్పుడో తీర్చేసేవా డన్నయ్య. పెళ్ళైన రెండేళ్ళ నుంచి పెట్టిన బట్టలూ, ఇచ్చిన కానుకలూ, లాంఛనాలూ అవీ లెక్కేసుకుంటే ఆ అయిదు వే లెప్పుడో ముట్టినట్టే.''

"అంటే?'' గర్జించింది పార్వతమ్మ.

ఉరిమినట్టు చూసింది కళ్యాణి.

"కట్న మిస్తే కానుక లివ్వక్కర్లేదా? బట్టలు పెట్టక్కర్లేదా? ఇదెక్కడి చోద్యం? ఇదేం విడ్డూరం? తెలివి మీరిపోతోం దొదిన !'' బుగ్గలు నొక్కుకుంది ఆడపడుచు.

"అమ్మో ! అమాయకురా లనుకున్నా గాని గడునుపిండానివే !'' తలాడించింది అత్తగారు.

"అదికా దత్తయ్యా !''

"అదీ ఇదీ కాదు కూడదనే స్థితికొచ్చావ్ ! మా మాటకే ఎదురు చెబుతున్నావ్ ! ఇలా కుదర దింక. వెళ్ళు వెంటనే మీ పుట్టింటికి ! అన్న కాళ్ళే పట్టుకుంటావో, కన్నీళ్ళే పెట్టుకుంటావో, లేక నీ అన్న కన్నీళ్ళకే కరిగి పుట్టింటే బతుకు నెట్టుకుంటావో నీ ఇష్టం ! అత్తింట కాలంటూ పెట్టటం జరిగితే అది కట్నం డబ్బుతోనే ! ఆఁ !''

"అత్తయ్యా...''

"ఇంకేమి టొదినా ఆలస్యం? బండికి్కూడా వేళైంది. వెంటనే బయలుదేరు !''

"అత్తయ్యా ! కుటుంబాన్నే పోషించుకోలేని స్థితిలో అప్పుల్లో మునిగి ఉన్న అన్నయ్య గొంతుకు ఉరి బిగించలేను ! అర్థం చేసుకోం డత్తయ్యా ! ఇంట్లోంచి వెళ్ళగొట్టి పరువు బజారుపాలు చెయ్యొద్దు...దయచేసి...''

"దయచేసేదీ లేదు, జాలి చూపేదీ లేదు ! మేం గనుక ఇన్నాళ్ళూ కాపరం చేయనిచ్చాం ! అదే ఇంకొకరైతేనో ఎప్పుడో తన్ని తగలేసి ఉందురు ! మరో పెళ్ళి చేసి ఉందురు !''

"అత్తయ్యా ! మీకు దణ్ణం పెడతాను. మీ కాళ్ళు పట్టుకుంటాను. పరిస్థితి నర్థం చేసుకోండి. ఇంత · కింత చాకిరీ అయినా చేస్తాను. ఇంకెంత కష్టమైనా భరిస్తాను. కాని...కాని... ఆ కట్నం డబ్బు కోసం వత్తిడి చేయకండి. ఇంట్లోంచి వెళ్ళగొట్టకండి. కలిగిన్నాడు అన్నయ్యే తెచ్చిస్తా డా డబ్బు ! నా మాట నమ్మండి.'' కన్నీళ్ళతో ప్రార్థించింది కస్తూరి.

నీ కల్లబొల్లి ఏడుపుల క్కరిగిపోత మనుకున్నావా? ఆ డబ్బుతో వస్తేనే నీ కీ ఇంట్లో స్థానం ! ఊఁ... వెళ్ళు !'' కచ్చితంగా అంది పార్వతమ్మ.

"ఇంకా అలాగే నిలబడ్డావేం? త్వరగా సర్దుకో బట్టలు ! రైలు వెళ్ళిపోగలదు !''

తొందరపెట్టింది దిక్కుతోచని స్థితిలోని కస్తూరిని కళ్యాణి.

కంట తడి తప్ప కర్తవ్యం తెలియని ఆ పరిస్థితిలో పొంగుకొస్తున్న దుఃఖా న్నదిమి పెట్టుకొని, నెట్టుతున్నట్టున్న అత్త, ఆడబిడ్డల చూపుల్ని తట్టుకోలేక, గూడు విడిచిన పిట్టలా అడుగు బయటపెట్టింది కస్తూరి.

ఆ సాయం సంధ్యలో ఏ సాయం పొందాలో, ఏ గమ్యం చేరాలో అర్థం కాలే దామె కా రైల్వేస్టేషన్లో.

అటు వెళ్ళనుంది తూర్పు వెళ్ళే రైలు. దిక్కు తూర్పే అయినా అటు సూర్యోదయం కాదు ! అది ఇను డస్తమించిన వేళ.

అటూ ఇటూ చూసి అప్రయత్నంగా యెక్కేసింది సూరీడుతో పాటు పయనించే పడమర వెళ్ళే రైలునే !

** ** **

కస్తూరి రాకతో మానిపించిన ఆ ఇంటి పనిమనిషి మళ్ళీ ఆమె నిష్క్రమణంతో గాని పనిలో చేరలేదు-అనే విషయం మాటవరసకో, లేక కస్తూరి కా ఇంట్లో స్థానాన్ని తెలిపేందుకో అనుకున్నా-అంతకు మించి చెప్పుకోవల్సిన సంగతులు...

కస్తూరి భర్త రామం చాలా మెతక మనిషి. తండ్రే తల్లి మాట కెదురాడనప్పుడు తా నెందు కనుకున్నాడేమో, పెళ్ళా మొచ్చాక కూడా అదే స్థితి కొనసాగిస్తున్నాడేమా అని ఆశ్చర్యపడక, తాత తండ్రుల నుంచి అది వంశపారంపర్య లక్షణం కామోను అనుకున్నారు చాలామంది.

భర్త చేసేది చిన్న ప్రైవేటు ఉద్యోగం. ఒక్కడికే చాలని జీతం, ఉండేది ఊరికి దూరం. అందుకే అతని మౌనం ! అని గ్రహించిన కస్తూరి మాత్రం కత్తులబోను వంటి అత్తింట్లో ఒద్దికగా, ఓర్పుగా, తనను తానే ఓదార్చుకుంటూ కాలం వెళ్ళబుచ్చటం నేర్చుకుంది తప్పనిసరి అయి.

** ** **

ఆదినుండీ కష్టాల్లో ఉన్న కాపురం కళ్యాణి పుట్టుకతో గట్టెక్కిందని పార్వతమ్మ గట్టి నమ్మకం. అందుకే ఆ ఇంటి గారాల ఆడపడుచుగా ఆడింది, పాడింది ఆట పాటగా తయారైంది కళ్యాణి. ఆ ఇంట్లో కళ్యాణి మాటే వేదవాక్కు. పెళ్ళి చేసి అత్తారింటికి పం పినా అత్తింట్లో కంటే పుట్టింట్లోనే ఆమె గడుపుతుం ది ఎక్కువగా.

"అమ్మగారూ...యిగో వుత్తరం వండి !''

బద్ధకంగా ఒళ్ళు విరుచు కుంటూ బెడ్పై నుంచే అందుకుంది తం పూరు చేతిలోని ఉత్తరాన్ని కళ్యాణి. అడ్రస్ చూసింది.

'తనకే ! శ్రీవారి నుంచి ! విరహతాపం భరించలేక కాబోలు ! మామూలే'గా !'

నవ్వుకుంటూ ఉత్తరం విప్పింది.

"ప్రియమైన కళ్యాణికి మురారి వ్రాయునది ! శుక్రవారం...అంటే తేదీ పదినాడు ఇంట్లో, ముఖ్యమైన శుభకార్యం ఉంది. ఇక్కడ నీ అవసర మెంతో ఉంది ! అంతకు మించిన బాధ్యత ఉంది. ఈ ఉత్తరం చూసిన వెంటనే బయలు దేరు. మళ్ళీ మళ్ళీ పెళ్ళి పిలుపు లుండవ్...ఇది నీ ఇల్లు ! ఏమంటావ్? కాదంటావా? నిర్లక్ష్యం చేస్తావా? శాశ్వతంగా నీ స్థానం నీ పుట్టింట్లోనే ! అది మరిచిపోకు ! అందుకే మళ్ళీ చెబుతున్నాను పదో తేదీలోగా తప్పక వచ్చెయ్...నీ కోసం ఎదురు చూస్తుంటాను !

నీ మురారి.''

"హుఁ ఏమిటో అర్జంటు? ఆయనే వచ్చి పిల్చుకెళ్ళవచ్చుగా? వస్తావా? రావా? అంటూ నిలదీస్తున్నాడు. బెదిరిస్తున్నాడు ! అబ్బో...మొద్దబ్బాయ్, మొండబ్బాయ్గా మారాడే ! ఏమిటో సంగతి? స్వయంగా తేల్చుకుంటాను !''

సణుక్కుంటూ గొణుక్కుంటూ ప్రయాణమైంది.

** ** **

"ఎందుకు అర్జంటుగా రమ్మన్నారు?''


గుమ్మంలోనే దూకుడుగా అడిగింది భర్తను కళ్యాణి.

"మొత్తంమీద ఈ రోజైనా వచ్చావ్ సంతోషం.''

"రాక ఛస్తానా? ఇంతకీ సంగతేంటి?

"నా చెల్లికి చీరే సారే పెట్టి అత్తింటికి పంపించాలి. ఇంటి కోడలివి...నువ్వు లేకుండా ఎలా?'' నవ్వాడు మురారి?

"త్వరగా రా కళ్యాణీ ! అమ్మాయికి తలంటు పోయాలి. గాజు లేయించాలి. ఇంట్లో ఇంకా చాలా పనులున్నాయి. వేళ మించిపోకుండా చీరే, సారే సిద్ధం కావాలి ! ఊఁ తెములు త్వరగా !''



అత్త జానకమ్మ త్వరపెట్టింది.

వింతగా చూసింది కళ్యాణి. "ఇప్పుడు చీరే...సారే...ఎవరి కత్తయ్యా?"

"ఇంకెవరికి? ఇంటి నుంచి చీరే, సారే, పసుపు కుంకా లెవరి కిస్తాం? శ్రీలక్ష్మి వంటి ఇంటి ఆడపడుచుకమ్మా !"

ఆడుకునే పిల్లలా చూసింది.

"అలా చూస్తావేం? వెళ్ళి చెల్లిని తయారుచెయ్ !" భుజం తట్టాడు మురారి.

"రా ! కళ్యాణీ..."

అత్తయ్య చెయిపట్టి లాకెళ్ళగా లోపలికి వెళ్ళింది కళ్యాణి.

"పదమ్మా స్నానానికి ! వదిన కళ్యాణి కూడా వచ్చింది" అంటూ అత్త పిలుస్తున్న ఆడపడుచు కేసి చూసిన కళ్యాణి కనుబొమలు ముడిపడ్డాయి.

"ను... ను వ్వెక్కడా? పుట్టింటికి తగలడలేదూ?" గుర్రుమంటూ కఠిన స్వరంతో అంది.

నిముషకాలం నిశ్శబ్దం !

"మాట్లాడవేం మహాతల్లీ? పుట్టింటి కెళ్ళి మిగిలిన కట్నం బాపతు డబ్బు తెమ్మంటే దేభ్యం మొహంతో ఇక్కడికి రావటానికీ, వీళ్ళ మెతకదనా న్నానరాగా తీసుకుని తిష్ఠ వెయ్యటానికీ సిగ్గులేదూ? ఛీ...ఛీ !"

"కళ్యాణీ !"

చిన్నపాటి గర్జనకు ఉలిక్కిపడింది కళ్యాణి.

"ఆమె నిం కొక్క మాటన్నా సహించేది లేదు. ఆమె నా చెల్లెలు ! ఈ ఇంటి ఆడబడుచు !"

మురారి కంఠం ఖంగుమంది.

"ఆహా చెల్లెలు! సొంత చెల్లెలా? ఆడబడుచు... అత్తయ్య కన్నకూతురా?"

నవ్వింది వెక్కిరింతగా కళ్యాణి.

"అంత తేలిగా నవ్వకు కళ్యాణీ... నే చెప్పేది శ్రద్ధగా విను ! ఆపైన మాట్లాడు. అంతదాకా ఓపిక పట్టు !"

చేయిపట్టి కూర్చోబెట్టాడామెను. జరిగిందంత భార్య కళ్ళముందు జరిగినట్టు వివరించసాగాడు.

** ** **

"అన్నయ్యా !"

తలుపు తట్టిన చప్పుడు. వెనక ఓ పిలుపు.

తెరిచిన వాకిలిగుండా పడిన వెలుగునిండా...అర్ధరాత్రి...ఓ ఆడపడుచు...ఒంటరిగా !

"ఎవరూ?" ఆశ్చర్యంగా మురారి !

"అన్నయ్యా !"

శోకసాగరంలో ఎగిసిపడే కెరటంలా అతని పాదాల్ని చుట్టేసిం దామె.

జన్మంతా నరిపడ్డ ఆర్తి నిండి ఉన్న ఆ పిలుపుతో చలించిపోయాడు మురారి. అక్క చెల్లెళ్ళు లేని అతని కప్పుడా శరణార్థిలో సొంత చెల్లెలు కనిపించింది.

"నువ్వా...కస్తూరీ? ఈ వేళప్పుడు ఒంటరిగా?" ఆమెను లేవదీసి ఇంట్లోకి పిల్చుకెళ్ళాడు.

కొంత స్తిమితపడ్డాక-కట్నంకోసం అత్త, ఆడపడుచు వెళ్ళగొట్టగా, కష్టాల్లో ఉన్న అన్నకు, కాలు విరిగి ఆర్నెల్లుగా ఇంట్లో పడి ఉన్న అన్నకు, అటు తలిదండ్రుల, ఇటు భార్యా బిడ్డల పోషణకు అప్పులే మిగుల్చుకున్న అన్నకు అదనపు భారం కాలేక, అగమ్యగోచరమైన స్థితిలో ఈ ఇంటి గడప తొక్కానని అవిరామధారలైన అశ్రువుల్తో చెప్పిన కస్తూరిని చూసి కరిగిపోయాడు మురారి.

"కస్తూరీ !" మురారి స్వరం కంపించింది.

"తీర్చిదిద్దిన కస్తూరీ తిలకంలా కనిపించేదానివి. చెరిగిన దిష్టిచుక్కలా మారావంటే...ఈ రెండేళ్ళలో అత్తింటి ఆరళ్ళెన్ని భరించావో ! ఆడపడుచు ఆగడాలెన్ని సహించావో ! నువ్వు చెప్పుకోలేని వెన్నో కళ్ళకు కడుతున్నాయమ్మా ! కస్తూరీ ! నీ కన్నీళ్ళు తుడవటానికి నేనేం చేయగలనో చెప్పమ్మా !"

"అన్నయ్యా... ఆ ఇంట్లో కళ్యాణి మాటే చెల్లుబాటు ! ఆమె తలుచుకుంటే కానిదే ఉండదు. అందుకే అర్థిస్తున్నాను. అంతగా చదువుకోని దాన్నిగా, పుట్టింటా ఆశ్రయం పొందలేని దాన్నిగా, బయటా బ్రతకలేని దానిగా ఓ మాట సాయం కోసం నిన్ను ప్రార్థిస్తున్నాను. డబ్బుకోసం సతాయించక, అన్నయ్య సర్దుకునేదాకా ఓపిక పట్టమని కళ్యాణికి నువ్వు నచ్చజెపితే చాలన్నయ్యా ! అత్తగారితో సమస్యే ఉండదు ! ఈ అభాగ్య సోదరి కదే పదివేలు !"

అతని రెండు చేతులూ పట్టుకుని దీనంగా అడిగింది కస్తూరి.

"అమ్మా... కస్తూరీ ! ముందుగా మాట తీసుకుని పురుషోత్తముణ్ణి ఇరుకులో పెడుతూ శత్రువునే వదిలేయమన్న రుక్మిణి కోరిక కాదు;

సొంత అన్న కిష్టంలేని బావతో పెళ్ళి జరిపే భారాన్ని కృష్ణుడిపై మోపిన సుభద్ర కోరికా కాదు...ఇంత చిన్న కోరికా చెల్లెమ్మా?"

"అన్నయ్యా !"

"అవునమ్మా ! నువ్వు కోరింది చిన్నదే ! కాని అన్నయ్యా అంటూ నువ్వు పిలిచావే ఆ పిలుపు చాలా పెద్దదమ్మా ! అర్ధరాత్రైనా ఈ అన్న ఇంటి తలుపు తట్టిన నీ నమ్మకాన్ని కాపాడే బాధ్యత, నీ కన్నీరు తుడిచే ఆర్ద్రత అన్నగా నా కుంటుంది కస్తూరీ !"

ఆప్యాయంగా ఆమె కురులు సవరించాడు మురారి.

"ఇప్పుడు చెప్పు కళ్యాణీ...కస్తూరి నాకు చెల్లి కాదని, కాలేదని !"

పలకలేదు కళ్యాణి.

"హుం చెప్పలేవు ! బాధించటం తప్ప బాధ గ్రహించటం తెలియని రాతిగుండెలేం చెబుతాయిలే? చూడూ, చక్కగా చీరే, సారే పెట్టి లక్షణంగా కస్తూరి నత్తింటికి పంపిస్తాను. అయిదు వేలూ, పది వేలూ అంటూ కస్తూరిని వేధించే ముందు ఆమె నా చెల్లిగా గుర్తుంచుకుని, మీ ఇంటల్లుడుగా ఆ మొత్తాలు నేను డిమాండ్ చేయాల్సినవిగా గ్రహించుకోండి చాలు !

"ఇవన్నీ ఆలోచించక ఆమె నారడిపెడితే, శాశ్వతంగా అత్తింట్లో స్థానం కోల్పోయేది కస్తూరి కాదు, నువ్వు ! అవును ! భర్త మాట గౌరవించని భార్యగా, స్త్రీకి శత్రువైన మరో స్త్రీగా నువ్వే ఆ శిక్షకు గురయ్యేది. తెలుసుకో ! కస్తూరి నా చెల్లెలు గనుక ఆమె కష్టనిష్ఠురాలన్నీ ఇప్పుడు నావి ! ఆమె నేమన దలుచుకున్నా ముందు తలచుకోవాల్సింది నువ్వు నీ భర్తను ! మీ అమ్మ తన ఇంటి అల్లుణ్ణి !"

కచ్చితంగా అన్నాడు మురారి అదే స్థిర నిర్ణయమన్నట్టుగా !

"ఏమండీ !"

అప్రతిభురాలైంది కళ్యాణి. భర్త మౌనం, సున్నితత్వం మాత్రమే తెలిసిన కళ్యాణి అతని కాఠిన్యానికి తట్టుకోలేకపోయింది.

"నన్ను...నన్ను క్షమించండి ! అతిగారాబంతో విచక్షణ విస్మరించాను. చదువుకున్నా సంస్కారం మరిచాను. ఆడపడుచునని అహంకరించాను. ఏదైనా తనదాకా వస్తేగాని తెలియదని గ్రహింపజేసి నా కళ్ళు తెరిపించారు. ఇప్పుడే వదినకు క్షమాపణ చెప్పుకుంటాను."

చెమర్చిన కళ్ళతో కస్తూరి వేపు కదిలింది కళ్యాణి. మరి కాసేపటి కామె వెనకే వెళ్ళిన మురారి కళ్ళకు, కళ్ళలో భయం పోయి ఆనందభవితలు కదలాడగా పట్టుచీరతో కళకళలాడుతున్న కస్తూరి నుదుట తిలకం దిద్దుతున్న కళ్యాణి కనిపించింది. ✪

